




అశ్వ వాహనంపై ఊరేగుతున్న ఖాద్రీశుడు

ఊరూరా సంబరం

ఘనంగా సంక్రాంతి.. పల్లెల్లో కోలాహలం



ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు, ఆటలు, ఉట్ల మాను, ఎడ్లబండ్ల పోటీలు, ఇళ్లకు చేరిన బంధువులతో ఊరూరా సంబరం కనిపించింది. తెలుగువారి సంప్రదాయ పండుగ సంక్రాంతిని ఉత్సాహంగా చేసుకున్నారు. భోగి, సంక్రాంతి, కనుమను ఘనంగా నిర్వహించారు. పల్లెల్లో ఎటుచూసినా కోలాహలం కనిపించింది. ప్రజాప్రతినిధులు పాల్గొని, సందడి చేశారు. ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. గొరవయ్యల విన్యాసాలు, భజన బృందం పాటలు, కీలుగుర్రాలు, చిల్లా కట్టి, బొంగరాల్ల ఆట, గోలీలాట, గాలిపటం ఎగురవేయడం తదితర ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. 140 కేజీల ఇసుక మూట మోసే పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ... సంస్కృతి, సంప్రదాయాలను మరువకూడదన్నారు. ప్రతిఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం



ఎడ్లబండితో పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయ ప్రదక్షిణ



ఉత్సాహంగా ఆటల పోటీలు

కనులపండువగా ఖాద్రీశుడి పార్వేటోత్సవం

ప్రశాంతి నిలయం.. నాటిక ప్రదర్శన

ఆకట్టుకున్న అవతార వైభవం

పుట్టపర్తి: స్థానిక ప్రశాంతి నిలయంలో సక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయికుల్వంత్ సభా మండపంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అవతార వైభవం పేరిట ప్రశాంతి నిలయం, బృందావన్, నందిగిరి క్యాంపస్ విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. రామాయణ, భాగవతంలోని ఘట్టాలను ప్రదర్శించారు. విద్యార్థులు సన్నాయి, వాయిద్యనాదంతో భక్తులను అలరింపజేశారు. సత్యసాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్.. విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. సంక్రాంతి సంబరాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని, సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నల్లమాడ మండలం దొన్నికోట వద్ద ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

● నేత్రపర్వం

కదిరి: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి పార్వేటోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. స్వామివారికి ఉదయం ఆలయంలో నిత్యపూజలు, కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం పార్వేటకు బయలుదేరారు. ఆలయం నుంచి భక్తుల గోవిందనామస్మరణ మధ్య తిరువీధుల నుంచి గిరి ప్రదక్షణగా కదిరి కొండకు చేరుకున్నారు. శ్రీవారి పల్లకీని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మోశారు. అనంతరం అర్చకులు నివేదనలు, పూజల అనంతరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న పాలపొంగలి ఉట్టికి మధ్యాహ్నాం చేరుకున్నారు. కౌలేపల్లికి చెందిన యాదవులు కొత్తకుండలో తెచ్చిన పాలను పోసి, పాలపొంగలితో స్వామివారికి నివేదన చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న పార్వేట మండపానికి స్వామివారు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం పార్వేటలో స్వామివారు పాల్గొన్నారు. వేలాదిమంది భక్తులు పార్వేటను తిలకించడానికి తరలివచ్చారు. కుందేళ్లను ఎగురవేసి పార్వేటలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం రాయచోటి రోడ్డులో ఉన్న శమీ మండపానికి స్వామివారు చేరుకుని, పూజలు అందుకున్నారు. అనంతరం అశ్వావాహనంపై చౌక్ మీదుగా తిరువీధుల్లో స్వామివారు ఊరేగారు. అనంతరం ఆలయంలో అలకబూనిన శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సంవాదం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



కుందేళ్లను చూపుతున్న భక్తులు



పార్వేటోత్సవానికి హాజరైన భక్తులు



ధర్మవరంలో ఇసుక మూటను మోస్తున్న వ్యక్తి

ఎప్పుడు కొంటారు..?



- రైతుల ఇళ్లలో కంది దిగుబడులు
- ఆర్‌ఎస్‌కేలలో రిజిస్ట్రేషన్లతో సరి
- కొనుగోలు ప్రారంభించని మార్క్‌ఫెడ్
- ధర తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన
- ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.7550

7

జగన్ పాలనలో అప్పుల కుప్పలు

మంత్రి సత్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

బత్తలపల్లి జనవరి15(ఆంధ్రజ్యోతి): సైకో జగన్ పాలనలో అన్ని శాఖలను అప్పుల పాల్జేశారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మండలంలోని యర్రాయపల్లిలో సీసీ రోడ్లను మంత్రి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత సీఎం సైకో జగన్ పాలనలో గ్రామాల అభివృద్ధి మరుగున పడిందన్నారు. విధ్వంసాలు, అక్రమ కేసులు పెట్టడం, దోపిడీలతోనే పాలన సాగిందన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పులు ప్రతి శాఖలోనూ కుప్పలుగా ఉన్నాయని మండిపడ్డారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 2.08 లక్షల పెట్టుబడులు పెట్టేందుకు అనేక కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధికి రూ.4500 కోట్లు విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో చల్లా పలువురు నాయకులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి భరించలేక టెకీ ఆత్మహత్య

7



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు

మళ్లీ ఆశలు

5 ఏళ్లుగా రైతులు, రీలర్లకు అందని ప్రోత్సాహకాలు

పట్టు పరిశ్రమపై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం

మడకశిర, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమపై గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. పట్టు రైతులు, రీలర్లకు అందించాల్సిన ప్రోత్సాహకాలను సైతం ఇవ్వకుండా అటకెక్కించింది. మల్బరీ సాగు గిట్టుబాటుకాక నష్టపోయిన అన్నదాతలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం కూడా అందక తీవ్రంగా నష్టపోయారు. చాలామంది పంట సాగుకు దూరమయ్యారు. రీలర్లకు కూడా ప్రోత్సాహకాలు అందక నష్టాలు మూటగట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ప్రోత్సాహకాలు ఇవ్వకపోతుందా అని రీలర్లు, పట్టు రైతులు ఆశించారు. ఆ మేరకే కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నాలుగు విడతల ప్రోత్సాహకాలను మంజూరు చేసింది. పట్టు రైతులకు గతేడాది ఏప్రిల్ నుంచి జనవరి వరకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలకు సంబంధించి రూ.1.97 కోట్లు, రీలర్లకు రూ.67.62 లక్షల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. త్వరలోనే సొమ్ము ఖాతాలకు జమవుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో రీలర్లు, రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రోత్సాహకాలు అందిస్తే పట్టు పరిశ్రమకు మళ్లీ పూర్వ వైభవం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.





జిల్లాలో 26,186 మంది రైతులు 45,828 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా దిగుబడి ఆశించిన స్థాయిలో లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో పట్టుపురుగులకు సన్నకట్టు, ఎర్రనచ్చు తెగులు సోకి దిగుబడి తగ్గిందని చెబుతున్నారు. దీంతో దిగుబడులు కూడా దక్కవని వాపోతున్నారు. ప్రోత్సాహకాలిస్తే పంట పెట్టుబడికైనా ఉపయోగపడుతుందని రైతులు పేర్కొంటున్నారు.

- రూ.కోట్లలో బకాయిలు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఉపశమనం
- నాలుగు విడతల ప్రోత్సాహకాలు మంజూరు

పేరుకు పోయిన బకాయిలు

రైతులు పట్టు గూళ్లను హిందూపురం మార్కెట్‌కు తీసుకెళ్లారు. మార్కెట్‌లో విక్రయించిన ప్రతి కిలో బైవోల్టిన్ పట్టుగూళ్లకు ప్రభుత్వం రూ.50 చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. గతంలో పట్టు గూళ్లు విక్రయించిన రెండు, మూడు నెలలకు రైతులకు ప్రోత్సాహకం అందేది. వైసీపీ పాలనలో దానిని అటకెక్కించింది. ఐదేళ్లుగా ప్రోత్సాహకం అందలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 6 డివిజన్లకు సంబంధించి దాదాపు రూ.18 కోట్లు ప్రోత్సాహకాలు చెల్లించాల్సి ఉంది. 2019 ఆగస్టు నుంచి 2024 మార్చి వరకు 130మంది దాకా రీలర్లకు రూ.3.50 కోట్లు, 500 నుంచి 600 మంది పట్టు రైతులకు రూ.18 కోట్లు రావాల్సి ఉంది. బకాయిల కోసం రైతులు, రీలర్లు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలకు సైతం పలుమార్లు విన్నవించారు. అయినా.. పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి అధికారంలోకి రావడంతో ప్రోత్సాహకాల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. గతేడాది ఏప్రిల్ నుంచి బకాయిలు మంజూరు చేసినట్లు అధికారుల సమాచారం.

రూ.18 కోట్లదాకా అందించాల్సి ఉంది

బై ఓల్టీన్‌ను పట్టుగూళ్లను మార్కెట్‌లో విక్రయించిన రైతులకు కేజీకి రూ.50 చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తోంది. రాష్ట్రంలో ఎనిమిది డివిజన్ల నుంచి పట్టుగూళ్లను హిందూపురం మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. రూ.18కోట్లదాకా ప్రోత్సాహకం చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం గతేడాది ఏప్రిల్ నుంచి ప్రోత్సాహకులు మంజూరయ్యాయి. బిల్లులు సీఎంఎఫ్ఎస్‌లో అప్‌లోడ్ చేశాం. త్వరలోనే నగదు వారి ఖాతాల్లోకి జమవుతుంది.

-సురేశ్, సహాయ సంచాలకుడు, పట్టుపరిశ్రమ శాఖ

రూ.3 లక్షలదాకా ప్రోత్సాహకం అందాలి: గోవిందప్ప, రైతు, దొక్కలపల్లి

నాకున్న రెండెకరాల పొలంలో ఏడేళ్లుగా మల్బరీ సాగు చేస్తున్నా. వాతావరణంలో మార్పుల కారణంగా మల్బరీ తోటకు తెగులు సోకడంతో పట్టుగూళ్ల దిగుబడి తగ్గిపోయింది. దీంతో ధరలు ఉన్నా.. పెట్టుబడులు కూడా గిట్టడం లేదు. గత ఐదేళ్లలో ప్రోత్సాహకం కూడా ఇవ్వలేదు. నాకు రూ.3 లక్షలదాకా బకాయిలు రావాల్సి ఉంది.

రూ.1.85 లక్షలు అందాల్సి ఉంది..


నాలుగెకరాల్లో మల్బరీ సాగు చేశా. పంట చేతి కొచ్చే సమయంలో మల్బరీ ఆకులకు పురుగులు పడుతున్నాయి. తోట దెబ్బతింటోంది. మల్బరీ సాగుకు గతంలో కంటే ప్రస్తుతం పెట్టుబడి కూడా పెరిగింది. పట్టుగూళ్లకు ప్రోత్సాహకం అందలేదు. రూ.1.85 లక్షలు రావాల్సి ఉంది.

- మంజునాథ్, రైతు, గుణేహాళ్



నేతకు చేయూత





- 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు
- హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

ధర్మవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఆదరణలేక నానాటికీ కుదేలవుతున్న చేనేతల అభ్యున్నతికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం చేనేతలకు ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు. ఏడాదికి రూ.24వేలు కొందరికే ఇచ్చి చేతులు దులుపుకుంది. పలుమార్లు అర్హులు తమకు రూ.24వేలు వర్తింపజేయాలని వినతులు ఇచ్చినా.. వాటిని బుట్టదాఖలు చేసింది. గతేడాది తుపాను కారణంగా పనుల్లేక పస్తులున్నా ఆదుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో చేనేతల కుటుంబ పోషణ కష్టసాధ్యంగా మారింది. గత ఎన్నికల ప్రచారంలో చేనేతలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ మేరకు చేనేత కార్మికులు వంద యూనిట్లలోగా వినియోగించుకుంటే ఉచిత విద్యుత్‌ను వర్తింపజేస్తున్నారు. దీంతో చేనేత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో దాదాపు 20వేల కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ధర్మవరం, సోమందేపల్లి, ముదిరెడ్డిపల్లి, గోరంట్ల తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులున్నారు. ఈ కుటుంబాలు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందేందుకు అర్హులు. ఇప్పటికీ జిల్లాలో పలు కుటుంబాలు ఉచిత విద్యుత్‌కు సంబంధిత శాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేనేత మగ్గాలకు మాత్రమే 100 యూనిట్లలోపు విద్యుత్ వాడితే బిల్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా చేస్తోంది. చేనేత కార్మికులు దరఖాస్తుతోపాటు గుర్తింపు కార్డు జతచేసి ఇస్తే 100 యూనిట్లలోగా వాడితే ఆ కార్మికుడికి ఆ పథకం కింద ఉచిత విద్యుత్ వర్తిస్తుంది. 100 యూనిట్లు దాటితే మొత్తం బిల్లు చెల్లించాల్సిందే. ప్రభుత్వం ఇచ్చిన హామీతో చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించినట్లే.



సద్వినియోగం చేసుకోవాలి

గత టీడీపీ హయాంలో 100 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇచ్చేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక దానిని అటకెక్కించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తోంది. దీనిని 200 యూనిట్లకు పెంచితే కార్మికులకు మరింత ఉపయోగకరంగా ఉంటుంది. చేనేతలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- వెంకటనారాయణ, చేనేతకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి



అవగాహన కల్పించాలి

జిల్లాలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం 100 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుండడంపై అవగాహన కల్పించాలి. అర్హులందరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలి. ఉచిత విద్యుత్ అందిస్తుండడం సంతోషంగా ఉంది. గత టీడీపీ హయాంలో అందించిన పథకాలను పునరుద్ధరించి చేనేత కార్మికులను ఆదుకోవాలి.

- చంద్రశేఖర్, చేనేత కార్మికుడు, ధర్మవరం



డ్రోన్ కెమెరాలతో నిఘా : ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూదం, గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం తదితర అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచాలని జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ల పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో నిర్మానుష ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు.. డ్రోన్ కెమెరాలతో బుధవారం జల్లెడ పట్టారు.

రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

- ముగ్గురికి తీవ్రగాయాలు

7

టీడీపీ కార్యకర్తపై దాడి

చెన్నేకొత్తపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త వడ్డే జయరాంపై వైసీపీ వర్గీయులు బుధవారం దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. జయరాం కియా అనుబంధ పరిశ్రమలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా, వైసీపీ వర్గీయులు మాడెం ఓబిరెడ్డి, ఆయన తమ్ముడు మాడెం ప్రకాశ్‌రెడ్డి, మనోహర్ రెడ్డి మాట్లాడే పని ఉందని పాల డెయిరీ వద్దకు తీసుకువెళ్లి చితకబాదారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

విషపు నీరు తాగి మూగజీవాల మృతి



ఆవులు, గొర్రెల కళేబరాలు

బ్రహ్మసముద్రం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నంజాపురం గ్రామ పొలాల్లో విషపు నీరు తాగి మూడు ఆవులు, 26 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. పైరుకు పిచికారీ చేసేందుకు పొలంలో నీటితొట్టిలో రైతు రసాయనాలను కలిపాడు. పొరపాటున ఆవులు, గొర్రెలు ఆ నీటిని తాగాయి. గోపాల మిత్ర గోవిందు, హరి అక్కడికి వెళ్లి పరిశీలించారు. వైద్యాధికారి సలహామేరకు చికిత్స చేసినా ఫలితం దక్కలేదు. మూగజీవాల మృతితో రైతు కెంచప్పకు రూ.3.56 లక్షలు, ఎర్ర కొండాపురం గ్రామానికి చెందిన జయన్నకు రూ.36 వేలు నష్టం జరిగిందని పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూడాలని పశువైద్యాధికారిని కోరారు.

హెచ్చెల్సీలో యువకుడి గల్లంతు

అనంతపురం క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కాలువలో పడిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. నగరంలోని నీరుగంటి వీధికి చెందిన సాయి శశాంక్ రెడ్డి(28) బీటెక్ పూర్తి చేసి, ఖాళీగా ఉంటున్నాడు. తన స్నేహితుడు కౌశిక్‌తో కలిసి బుధవారం మధ్యాహ్నం మద్యం సేవించాడు. అనంతరం ఇద్దరూ కలిసి సుఖ్‌దేవ్ నగర్‌కు వెళ్లి.. హెచ్చెల్సీ గట్టుమీద కూర్చున్నారు. కాసేపటికి మరో స్నేహితుడు శ్రీకాంత్‌రెడ్డి వారిని కలిశాడు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియదుగానీ, సాయి శశాంక్‌రెడ్డి కాలువలో పడి కొట్టుకుపోయాడని సాయంత్రం 4.30గంటల సమయంలో స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. తొలుత త్రీటౌన్ పోలీసులు వెళ్లారు. ఘటన జరిగినది తమ పరిధి కాదని ఫోర్త్‌టౌన్ పోలీసులకు తెలియజేశారు. వారు గాలింపు చర్యలు చేపట్టారు.

రెండు ప్రాంతాల్లో ప్రమాదాలు

ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో బోయ సంజీవప్ప (వృత్తంలో), బోయ ఈరన్న

పెనుకొండ రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెండు ప్రాంతాల్లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రొద్దం మండలం ఎం.కొత్తపల్లికి చెందిన బోయ సంజీవప్ప(54), బోయ ఈరన్న ద్విచక్రవాహనంలో పెనుకొండకు వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి మట్టిదిమ్మెను ఢీకొట్టింది. దీంతో బోయ సంజీవప్ప తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఈరన్నను పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు..

రొద్దం మండల కేంద్రానికి చెందిన చాంద్ బాషా, వంశీ ద్విచక్రవాహనంలో కర్ణాటకకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న బైకు మలుపువద్ద అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వంశీని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఈ ప్రమాదాలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చౌడమ్మకు జ్యోతులు

తొగటవీర క్షత్రియుల అగ్నిగుండ ప్రవేశం

వేలాదిమంది భక్తులతో పోటెత్తిన ధర్మవరం



చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవంలో పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే కందికుంట, పరిటాల శ్రీరామ్



జ్యోతులతో పరిటాల శ్రీరామ్, సంధా రాఘవ

ధర్మవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొగటవీర క్షత్రీయ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పట్టణంలోని పలు వార్డులలో జ్యోతులు, కలశాలను ఊరేగించారు. మొత్తం 39 కమిటీలు ఒక్కటిగా చేరి అర్ధరాత్రి నుంచి అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. మేళతాళాల నడుమ నాట్యమాడుతూ మంగళవారం తెల్లవారుజాము వరకూ వేడుకలు నిర్వహించారు. ఆ తరువాత దుర్గమ్మగుడి వద్దకు చేరుకుని హోమగుండం ప్రవేశం తరువాత ఆలయంలో అమ్మవారి ఎదుట జ్యోతులను దింపారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, కులగురువు దివ్యజ్ఞానానందగిరి స్వామి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. పరిటాల శ్రీరామ్, చేనేత సంఘాల ప్రముఖులు, టీడీపీ నాయకుడు సంధారాఘవ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, జ్యోతులను తలపై పమోస్తూ, అమ్మవారిని కీర్తిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని, చేనేతలకు మంచి జరిగేలా అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని పరిటాల శ్రీరామ్ ఆకాంక్షించారు. అన్ని వార్డులలోని అమ్మవార్ల ఆలయాల్లో ఆయన పూజలు నిర్వహించుకున్నారు. వేడుకలను తిలకించడానికి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తొగటవీర క్షత్రీయులు తరలివచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, చేనేత ప్రముఖులు జయశ్రీ పాల్గొన్నారు.

21న దివ్యాంగుల కమిటీ హాల్ ప్రారంభం

● ఎంపీ అంబికాకు ఆహ్వానం



ఎంపీ అంబికాను కలిసిన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పామిడి సమీపంలో విశాల పెర్రర్ దివ్యాంగుల కమిటీ హాల్ ప్రారంభోత్సవానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆహ్వానించారు. సమితి ఉమ్మడి జిల్లా కో - ఆర్డినేటర్ హరి నాథ్‌రెడ్డి, పామిడి మండలం అధ్యక్షుడు కేశవచారి, ఉపాధ్యక్షుడు నాగభూషణ, కార్యదర్శి సర్వేష్, నాయకులు బందే సాబ్, నరసింహులు, శివన్న బుధవారం నగర శివారులోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వానించారు. ఈ నెల 21న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భం గా హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. కమిటీ హాల్ నిర్మాణానికి రూ.7 లక్షలు ఎంపీ నిధులు కేటాయించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ హాల్ చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

జిల్లా సబ్‌జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక



ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా సబ్ జూ నియర్ హాకీ బాలుర జట్టును ఎంపిక చేసినట్లు హాకీ అనంతపురం జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. జట్టుకు ప్రదీప్, ఆంజనేయులు, జి వరుణ్, జస్వంత్, నూర్ మహ్మద్, అక్షయ్ కుమార్, కార్తీక్, గయానందరెడ్డి, వరుణ్, నందకిశోర్, గోవర్ధన్, అఖీరా, పవన్, ఉదయ్, బాబాఫరీద్, వెంకటేష్, పవన్‌కుమార్, జునైద్, స్టాండ్ బైలుగా దీపక్, ధనుష్‌కుమార్, మోహిత్ ఎంపికయ్యారన్నారు. వీరు శుక్రవారం నుంచి మదనపల్లిలో నిర్వహించే 14వ ఏపీ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలు, క్రీడా సామగ్రితో హాజరుకావాలని ఆయన వివరించారు.



ఆరబోసిన కందులు

ఉమ్మడి జిల్లాలో కంది కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ఖరీఫ్(2023) సీజన్‌లో ఏడాది సివిల్‌సప్లై కార్పొరేషన్ ఆధ్వర్యంలో రైతుల నుంచి కనీస మద్దతు ధరతో కందులు కొనుగోలు చేశారు. గతంలో బహిరంగ మార్కెట్‌లో ఎంత ధర ఉంటే అదే ధరకు ప్రభుత్వం కందులు కొనుగోలు చేసేది. ఈ ఏడాది ఏపీ మార్క్‌ఫెడ్‌కు కందులు కొనుగోలు బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది క్వింటా కంది కనీస మద్దతు ధర రూ.7550గా నిర్ణయించారు. రెండు నెలల కిందట బహిరంగ మార్కెట్‌లో క్వింటా కంది రూ.9వేల నుంచి రూ.10వేలు పలికింది. ఆ తర్వాత క్రమంగా తగ్గింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.6500 నుంచి రూ.7300 దాకా పలుకుతోంది. గతేడాది ఖరీఫ్ ఆరంభంలో సాగు చేసిన కంది పంట దిగుబడి వచ్చింది. అరకొరగా వచ్చిన దిగుబడికి ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో రైతులు నిట్టూరుస్తున్నారు. ధర భారీగా తగ్గడంతో కొందరు రైతులు పంట దిగుబడిని అలాగే నిల్వ చేసుకున్నారు. మరికొందరు బహిరంగ మార్కెట్‌లో అయినకాడికి విక్రయిస్తున్నారు. గత ఖరీఫ్‌లో(2023) డిసెంబరు రెండో వారంలోనే కందులు కొనుగోలు ఆరంభించారు. ఈ సారి అదే సమయానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కందులు కొనుగోలు ప్రక్రియ ఆరంభించకపోతే రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. -ఆంధ్రజ్యోతి అనంతపురం అర్బన్/ గుత్తి రూరల్



ఎప్పుడు కొంటారు..?

రైతుల ఇళ్లలో కంది దిగుబడులు

ఆర్‌ఎస్‌కేలలో రిజిస్ట్రేషన్లతో సరి

కొనుగోలు ప్రారంభించని మార్క్‌ఫెడ్	ధర తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన	ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.7550





గుత్తి పరిధిలో బస్తాల్లో ఉంచిన కందులు

మందకొడిగా రిజిస్ట్రేషన్

ఉమ్మడి జిల్లాలో కంది రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. గతేడాది డిసెంబరు 15 నుంచి ఉమ్మడి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో కందులు విక్రయించాలనుకునే రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకటించారు. అయితే క్షేత్రస్థాయిలో పలు ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరిగా చేయలేదన్న విమర్శలున్నాయి. గత వారం రోజుల నుంచి రైతు సేవా కేంద్రం సిబ్బంది వాట్సాప్ గ్రూప్‌ల్లో సమాచారం అందించి, కంది రైతుల పేర్లు రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేసినట్లు సమాచారం. అనంత జిల్లాలో ఇప్పటి దాకా 1440 మంది రైతులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇప్పటి దాకా 900 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనంత జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 1.03 లక్షల హెక్టార్లల్లో కంది పంట సాగు చేయగా 71వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో 36వేల హెక్టార్లల్లో కంది పంట సాగు చేశారు. దాదాపు 28వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేశారు. అనంత జిల్లాలో కనీస మద్దతు ధరతో 45వేల మెట్రిక్ టన్నులు, శ్రీ సత్యసాయిలో 15వేల మెట్రిక్ టన్నుల కంది కొనుగోలు చేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయించారు.



ఏపీ మార్క్‌ఫెడ్ కార్యాలయం

కొనుగోలు ఎప్పటి నుంచో...?

ఈ ఏడాది కంది కొనుగోలు బాధ్యతలను ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు పలు రకాల సొసైటీలకు అప్పగించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి కొనుగోలుకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయలేదు. ఆదేశాలు రాగానే కొనుగోలు ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. కనీస మద్దతు ధర అమలు చేసేందుకు 12 శాతంలోపు తేమ శాతం ఉండాలని నిబంధన విధించారు. ఖరీఫ్‌లో ఈ పంట నమోదు ఆధారంగానే పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో పలువురు రైతులు వేరుశనగ పంటకు అంతర పంటగా కంది సాగు చేశారు. మరికొందరు పూర్తిగా కంది పంటనే సాగు చేశారు. అంతర పంటగా సాగు చేసిన రైతులకు పేరు నమోదులో చుక్కెదురవుతోంది. ఈ పంట నమోదులో వేరుశనగ పంటగా నమోదు కావడంతో... కంది పంట దిగుబడి వచ్చినా కనీస మద్దతు ధరకు విక్రయించలేని దుస్థితి నెలకొంది. మరోవైపు ఒక్కో రైతు నుంచి ఎన్ని క్వింటాళ్లు కందులు కొనుగోలు చేస్తారన్న అంశంపై స్పష్టత లేదు. మండలం యూనిట్‌గా దిగుబడి ఆధారంగా ఒక్కో రైతుతో ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేసేది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత యాప్‌లో తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కువ విస్తీర్ణంలో కంది పంట సాగు చేసిన రైతులు ఏం చేయాలో తోచని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

కర్నూలుకు వెళ్లాల్సిందేనా...?

జిల్లాలో కనీస మద్దతు ధరతో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టకపోవడంతో ఎక్కువ విస్తీర్ణంలో కంది సాగు చేసిన రైతులు కర్నూలు మార్కెట్‌పై దృష్టి పెట్టారు. అక్కడికి కందులు తీసుకెళ్లి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. రెండు నెలల కిందట బహిరంగ మార్కెట్‌లో క్వింటా కంది ధర రూ.9వేల నుంచి రూ.10వేలు ఉండేది. గతేడాది డిసెంబరు నుంచి ధర తగ్గుతూ వచ్చింది. బహిరంగ మార్కెట్‌లో కందులు నాణ్యత ఆధారంగా ప్రస్తుతం క్వింటా రూ.6500 నుంచి రూ.7300 నడుస్తోంది. కర్నూలు మార్కెట్‌లో ప్రస్తుతం నాణ్యత బట్టి రూ.7600 నుంచి 7750 దాకా ఉంది. అక్కడ నాణ్యత ఆధారంగానే రోజు వారిగా ధర నిర్ణయిస్తున్నట్లు సమాచారం. కందులు విక్రయించిన వెంటనే నగదు చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.



త్వరగా కొనుగోలు చేయాలి..



పది ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. 27 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రైతు సేవా కేంద్రంలో పేరు రిజిస్ట్రేషన్ చేసుకున్నా. ఎప్పటిలోగా కందులు కొంటారో కచ్చితంగా ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో త్వరగా కందులు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

-పెద్దన్న, రామినేపల్లి, రాప్తాడు మండలం

కర్నూలు మార్కెట్‌కు తీసుకువెళ్తా..



ఖరీఫ్ ఆరంభంలోనే ఐదెకరాల్లో కంది పంట సాగు చేశా. ఈ సారి ఎకరాకు నాలుగున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రైతు సేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. అయితే ఎప్పటి నుంచి కొనుగోలు మొదలు పెడతారో అర్థం కావడం లేదు. అందుకే కర్నూలు మార్కెట్‌కు కందులు తీసుకెళ్లి అమ్మేద్దామనుకుంటున్నా.

- శివారెడ్డి, కందుకూరు, అనంతపురం రూరల్ మండలం

ఆదేశాలు రాగానే కొనుగోలు..

గతేడాది డిసెంబరు 15 నుంచి ఉమ్మడి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో కందుల కొనుగోలు కోసం రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాం. ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు ఆధారంగానే రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే.. సంక్రాంతి పండుగ తర్వాత ఉమ్మడి జిల్లాలో కందులు కొనుగోలు ఆరంభిస్తాం. కొనుగోలు ఆరంభమైన తర్వాత కూడా కొత్తగా ఎవరైనా పేర్లు నమోదు చేసుకోవచ్చు.

- పెన్నేశ్వరి, గీత, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎంలు

టమోటా కిలో రూ.9

అనంతపురం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 9తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 90టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.



పని ఒత్తిడి భరించలేక టెకీ ఆత్మహత్య



టెకీ శివరాఘవరెడ్డి మృతదేహం

ధర్మవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి భరించలేక ఓ టెకీ ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని ఓ లాడ్జిలో ఈనెల 13వ తేదీన రాత్రి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శివరాఘవరెడ్డి (22) ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లికి చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు శివరాఘవరెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండేవాడు. పనిఒత్తిడి ఎక్కువవడం, ఉద్యోగం ఇష్టంలేక తీవ్ర ఆవేదన చెందాడు. ఈనెల 13న ధర్మవరం చేరుకుని, ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. అదే రోజు రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని, మరణించాడు. 14న ఉదయం లాడ్జి సిబ్బంది గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, టెకీ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టెకీకి వివాహం కాలేదు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో బేల్దారి..

కొత్తచెరువు: మండలకేంద్రంలోని పోతలప్పస్వామి గుడి సమీపాన బేల్దారి బోయ శివ (38) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ ఇందిర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రానికి చెందిన బోయశివ మూడు నెలల క్రితం ఉపాధి కోసం కొత్తచెరువుకు భార్య, పిల్లలతో వచ్చాడు. బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. అతడి భార్య గోరంట్ల మండలం గుంతపల్లి వద్ద ఉన్న గార్మెంట్స్‌లో పనిచేస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. ఎంత సేపటికీ శివ బయటకు రాకపోవడంతో స్థానికులు ఇంటి తలుపులు తట్టినా పలకలేదు. దీంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీనిపై స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివకు భార్య సావిత్రి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

న్యూస్ బాక్స్

కిటకిటలాడిన పాలపాటిదిన్నె



ఆంజనేయస్వామి మూలవిరాట్.. ఉత్సవ విగ్రహం ఊరేగింపు

నల్లచెరువు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయం సంక్రాంతి సందర్భంగా భక్తులతో కిటకిటలాండింది. పార్వేట కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా చుట్టుపక్కల గ్రామీణుల ఎద్దుల బండ్లను గర్భగుడి చుట్టూ తిప్పారు. భక్తులకు అన్నదానానికి పి.కొత్తపల్లి జయరామిరెడ్డి సహకరించినట్లు ఆలయ ఈఓ రవీంద్రరాజు తెలిపారు. ఉదయం అభిషేకాల అనంతరం పాలపొంగుళ్లు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

ఉత్సాహంగా ఉట్లమానోత్సవం

నల్లమాడ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్నికోట గ్రామంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామికి ఘనంగా పార్వేటోత్సవం నిర్వహించారు. పురవీధుల్లో స్వామిని ఊరేగించారు. అనంతరం గ్రామ సమీపంలోని పొలాల్లో ఉట్లమానోత్సవం నిర్వహించారు. ఉట్ల మాను ఎక్కడానికి యువత పోటీపడ్డారు. తిలకించడానికి మండల వాసులతోపాటు, చుట్టు మండలాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కుందేళ్ల పార్వేట నిర్వహించారు.

మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవీంద్ర



కొత్తచెరువు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తచెరువుకు చెందిన ఆర్.రవీంద్ర బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న లక్ష్మీనారాయణ ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో కొత్తచెరువులో సమావేశం నిర్వహించి రవీంద్రను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కోసం 7013512562, 9701436499 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ముగ్గుల చెరిపివేత.. పోలీసులకు ఫిర్యాదు

ముదిగుబ్బ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలో మహిళలు అర్ధరాత్రి వేసుకున్న రంగవల్లులను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున చెరిపేశారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం ప్రాంతం, షరీఫ్ స్కూల్ వీధి, రైల్వేస్టేషన్‌రోడ్డు, వాసవినగర్ ప్రాంతాల్లో ముగ్గులను చెరిపివేయడంపై మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రంగవల్లులను చెరిపేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ, బజరంగదళ్, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ సంఘాల నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పది ద్విచక్రవాహనాలలో తిరుగుతూ ముగ్గులను చెరిపివేశారని తెలిపారు. చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రకాశ్ డిమాండ్ చేశారు.

జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా నాగవేణి



ఓబుళదేవరచెరువు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మిట్టపల్లికి చెందిన బోగే నాగవేణిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. తనకు పదవి కల్పించిన నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తనకల్లు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారప్పగారిపల్లికి చెందిన వెంకటరమణ రెండునెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ పరిస్థితిపై స్పందించిన వందేమాతరం టీమ్ సభ్యులు సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం రూ.25వేల ఆర్థికసాయం అందించారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

నల్లమాడ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లి సమీపంలో కోడిపందెం ఆడడానికి వెళ్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు మంగళవారం ఎస్ఐ దాదాపీర్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రెడ్డిపల్లి, దొన్నికోట, వంకరకుంట, ఎన్ యనుములవారిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని అన్నారు. కోడి పందేలు ఆడడానికి వెళ్తున్నవారిని అనుమానంతో పరిశీలించగా వారి వద్ద ఐదు కోడి పుంజులు ఉన్నాయని, వారిని అరెస్టు చేసి రూ.6,050 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరంతా బుక్కపట్నం మండలానికి చెందినవారన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

బత్తలపల్లి జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతసాగరం గ్రామంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన చెరుకూరి ఈశ్వరమ్మ, ప్రవీణ్ వర్గీయులు పాత గొడవలు మనుసులో పెట్టుకొని గొడవ పడ్డారని పేర్కొన్నారు. ఘర్షణలో చెరుకూరి ఈశ్వరమ్మ,హేమంత్, రామాంజనేయులు,ప్రవీణ్‌తోపాటు ఈశ్వరయ్య, శివయ్య, గవ్వల ఈశ్వరమ్మ గాయ పడ్డారని, వారిని ఆర్‌డీటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇరువర్గాలకు చెందిన 11మందిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వివరించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్పందన ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు వైద్యులు బషీర్, సోనియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, ఇసీజీ, 2డి ఎకో తదితర పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు.

బైకు ఢీకొని ఆటో డ్రైవర్‌కు గాయాలు

ధర్మవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఆటో డ్రైవర్ మహేష్‌ను బైకు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన మహేష్ బ్రహ్మంగారి గుడి వద్ద తన ఇంటి ముందు ఆటోకు పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎర్రగుంట సర్కిల్ వైపు నుంచి ఓ వ్యక్తి బైకుతో వచ్చి ఢీకొట్టాడు. ప్రమాదంలో మహేష్‌కు తీవ్రగాయాలు కాగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సైనికుల త్యాగాలను స్మరించుకుందాం

ధర్మవరంరూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించే సైనికుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని ఆదర్శసేవా సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం జాతీయ సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదర్శసేవాసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదర్శ పార్క్ వద్ద ఉన్న సైనిక స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాసులు, కుమార్‌స్వామి, ప్రకాష్, ప్రభాకర్‌గుప్తా, నాగభూషణ, మారుతి పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు







పుట్టపర్తి : భరతనాట్యం చేస్తున్న చిన్నారి చైత్ర, విజేతలకు బహుమతుల ప్రదానం, ధర్మవరం రూరల్ : త్రిలింగేశ్వరస్వామి, నంబులపూలకుంట : పాడి ఆవుకు పొంగళ్లు.. పుట్టపర్తి వద్ద డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నదానం, గాండ్లపెంటలో అమ్మవారికి అలంకరణ

పుట్టపర్తిరూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో తొలిపండుగ మకరసంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. సోమ, మంగళ, బుధవారాల్లో పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు ఇంటిముందు గొబ్బెమ్మలతో కూడిన రంగవల్లులను తీర్చితిద్దారు. పుట్టపర్తిలోని శిల్పారామంలో మూడు రోజులపాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ప్రేక్షకులకు అలరించాయి. మొదటిరోజు టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో శిల్పారామం ఏఓ, సిబ్బంది మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం పులివెందుల రాజా డ్యాన్సు అకాడమీచే పట్టణానికి చెందిన బిల్లర్లు రమేష్, ప్రదీప్ సహకారంతో డ్యాన్సు జబర్దస్త్ ఫేం శాంతిస్వరూప్, రియాజ్ కామెడీషో ప్రేక్షకులను అలరించాయి. చిన్నారి చైత్ర తలపై సంక్రాంతి దీపాలు, బిందెపై నిలబడి చేసిన నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. వివిధ నృత్యాలతో చిన్నారులు, పెద్దలు చేసిన గ్రూప్ డ్యాన్సులు అలరించాయి. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు సామకోటి ఆదినారాయణ, పీసీ గంగన్న, బెస్త చలపతి, చెన్నకేశవులు, మహమ్మద్‌రఫీ బహుమతులు అందచేశారు. బుధవారం కనుమ సందర్భంగా ధర్మవరం నాట్య అకాడమీచే నృత్యాలను నిర్వహించారు.

● ధర్మవరంరూరల్ : మండల వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం సంక్రాంతి పండుగను పురష్కరించుకుని లోగిళ్లలో రంగురంగులా ముత్యాలు ముగ్గులతో అలంకరించి, సంప్రదాయాన్ని చాటే గొబ్బెమ్మలు పెట్టి గుమ్మడికాయలు కొట్టి వాడవాడలా సందడి చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగరీత్యా స్థిరపడిన వారు సొంతూళ్లకు తరలివచ్చారు. ధర్మవరం పట్టణంలోని తేరుబజార్ సమీపంలో వెలసిన శ్రీత్రిలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కనుమపండుగను పురష్కరించుకుని విశేషపూజలు చే శారు. ఆలయ అర్చకుడు రామవశర్మ త్రిలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా పాడి ఆవు అలంకరణ చేసి దర్శనం గావించారు.

● నంబులపూలకుంట : మండల వ్యాప్తంగా మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండును ఘనంగా నిర్వహించారు. కనుమ రోజున పాడిరైతుల పశువుల పాకలో పాల పొంగుళ్ల ఏర్పాటు చేసి పశువులకుపొంగుళ్ల తినిపించారు. పశువులను పసుపుకుంకుమ, పూలవ్వలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.

● పుట్టపర్తిరూరల్ : జిల్లాకేంద్ర పరిధిలోని కర్ణాటకనాగేపల్లి ప్రేమసాయిసదన్ వృద్ధాశ్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వృద్ధులకు పసందైన భోజనంతో పాటు పాలు, పండ్లు స్వయంగా వడ్డించారు.

● గాండ్లపెంట : మండల వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలను మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కత్తివారిపల్లిలో చౌడేశ్వరీ అమ్మవారికి గొడుగుల మెరవనం, అమ్మవారి విగ్రహం ఊరేగింపు చేశారు. వేపరాల వద్ద వెలసిన తిరుమలదేవున్ని పలువురు భక్తులు కొండమీదకు వెళ్లి దర్శించుకుని, మంగళవారం రాత్రి జాగరణ చేసి, చెక్క భజన నిర్వహించారు.బుధవారం మల్లమీదపల్లి, కోటూరువద్ద ఆంజనేయస్వామి బండ్లమెరవన నిర్వహించారు.

● బత్తలపల్లి: మండల వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.వృత్తి రీత్యా పట్టణాలకు వెళ్లిన వారందరూ గ్రామాలకు చేరుకున్నా రు. మహిళలు ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేశారు.

● తనకల్లు: మండలవ్యాప్తంగా మంగళవారం సంక్రాంతి పండుగన ఘనంగా నిర్వహించారు. బుధవారం రైతులు వ్యవసాయంలో తమకు అన్నివిధాలుగా చేదోడుగా ఉన్న పశువులను అలంకరించి, ముస్తాబుచేసి, తాము వండుకున్న అనపకాయలు, దోసెలు, అన్నం పశువులు కూడా పెట్టారు.


తనకల్లు : పశువులను అలంకరించిన రైతు

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎంపీ

కదిరి అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు.మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో పదిరోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో తలుపుల టడర్స్‌పై అంబేద్కర్ లయన్స్ విజేతగా నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పార్థసారథి, దేవానంద్, జీఎం శేఖర్, ఉత్తమరెడ్డి, సుదర్శన్, వెంకటేష్, ఆంజనేయులు, గిరిజమ్మ, చంటి, రామమోహన్, శరత్‌కుమార్‌రెడ్డి, హరినాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న లక్ష్మణ్

ఎండ్లబండ్ల పోటీల్లో విజేతలకు బహుమతులు


ఎండ్లబండ్ల పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పట్నం గ్రామం వద్ద బుధవారం ఎండ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి రైతులు ఉత్సహంగా ఎండ్ల బండ్లతో పాల్గొన్నారు. కార్యక్రమానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను తిలకించారు. సంస్కృతి, సంప్రదాయలను గౌరవిస్తూ ఇలాంటి పోటీలు నిర్వహించడం హర్షనీయమని, నిర్వాహలను అభినందించారు. పోటీల్లోపట్నం గ్రామానికి చెందిన గురు మొదటి బహుమతి రూ.40వేలు, దూసేపల్లికి చెందిన బులెట్ రాఖీ ద్వితీయ బహుమతి రూ.30వేలు, కొత్తచెరువుకు చెందిన దేవ తృతీయ బహుమతి రూ.20వేలు, కొత్తచెరువుకు చెందిన నాగన్న నాల్గో బహుమతి రూ.10వేలు, దొన్నికోటకు చెందిన రాణాటీమ్ ఐదో బహుమతి రూ.5వేలు గెలుపొందారు. కార్యక్రమంలో నిర్వాహకులు పట్నం గ్రామానికి చెందిన కుప్పాల ప్రసాద్, క్రిష్ణానాయక్, బాలాజీనాయక్, ఆంజనేయులు, రాజశేఖరొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవిని దర్శించుకున్న మంత్రి


అగ్నిగుండానికి నూనె పోస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరిదేవిని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి ఆశీర్వాదంతో ధర్మవరం పట్టణం మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ధర్మవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో గత వారం నిర్వహించిన సత్యసాయి జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులను ఎంపిక చేసినట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బందనాధం సూర్యప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు తెలిపారు. వీరు గురువారం నుంచి ఈనెల 19వతేఈ వరకు మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలుర హాకీ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. జట్టు సభ్యులుగా శబరీష్‌గౌడ్, ఫజులుద్దీన్, వెంకటశ్ అభిషేక్, రితీశ్, రాంచరణ్, సాదిక్‌వలి, గోవర్ధన్,జశ్వంత్, నవదీప్, ఆదికేశవ, విక్కీ, పోతలయ్య, స్వామి, సచిన్, కార్తీక్, ధనూష్, రాహుల్, పునీత్‌చరణ్‌తేజ్ ఉన్నారు. జట్టుకు శబరీష్‌గౌడ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారన్నారు. కోచ్ సాయికుమార్, మేనేజర్‌గా వెంకటేశ్‌నాయక్ వ్యవహరించనున్నారన్నారు.


బాలుర హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ప్రాచీన కళలను మరువరాదు


ఏనుగు తోలుబొమ్మను బహూకరిస్తున్న కళాకారుడు

ధర్మవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళలను ఎన్నటికీ మరువరాదని, ముఖ్యంగా తోలుబొమ్మలాట చాలా అద్భుతంగా ఉందని మారిషస్‌లో స్థిరపడిన సింహాద్రి లచ్చయ్య పేర్కొన్నారు. మారిషస్ నుంచి సింహాద్రి లచ్చయ్య, భార్య కౌసల్య మంగళవారం ధర్మవరం వచ్చారు. లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న తోలుబొమ్మల కళాకారుడు రామాంజనేయులు ఇంటికి వెళ్లారు. అక్కడ తోటు బొమ్మల ఆటను ప్రదర్శించారు. తోలు బొమ్మలు, వాటి ప్రాచీనత్వం గురించి అడిగితెలుసుకున్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు అంటే తమకు ఎంతో ఇష్టమని , త్వరలో తోలుబొమ్మల కళాకారులను తమ దేశానికి పిలిపించి ప్రదర్శిస్తామని చెప్పారని కళాకారుడు రామాంజనేయులు తెలిపారు. సింహాద్రి లచ్చయ్య విశాఖపట్నం చెందినవారు. ఈయన కుటుంబం మూడుతరాల నుంచి మారిషస్‌లో స్థిరపడ్డారు. తెలుగుభాష, ప్రాచీన కళలు, సాంప్రదాయాలపై మక్కువతో ధర్మవరం వచ్చినట్టు తెలిపారు.

అయ్యప్ప అఖండజ్యోతి


భక్తులు వెలిగించిన అఖండజ్యోతి

ఓబుళదేవరచెరువు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో మంగళవారం ఆలయ సంకల్పకుడు పచ్చర్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో అయ్యప్ప అఖండ జ్యోతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శబరిమలైలో అయ్యప్పస్వామి మరకజ్యోతి పురష్కరించుకుని స్థానికంగా 13వ అయ్యప్పస్వామి ఆఖండజ్యోతి వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. వందలాదిమంది భక్తుల నడుమ 18 కిలోల కర్పూరంతో ఆఖండ జ్యోతి వెలిగించి, అయ్యప్పను దర్శించుకున్నారు.

ఘనంగా పడిపూజోత్సవం

తాడిమర్రి: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా పడిపూజ నిర్వహించారు. అయ్యప్పమాలధారుల కు ఇరుముడి సందర్భంగా అయ్యప్పను, పడిని అందంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అన్నదానకార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి సత్యనారాయణ, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఊరంతా ఏకం.. పరుచుకున్న పచ్చదనం

- గ్రామ సంఘాలతో అడవుల సంరక్షణ
- వేలాది ఎకరాల్లో విస్తరించిన చెట్లు
- గిరిజన ప్రాంతాల్లో వెల్లువెత్తిన చైతన్యం

తనకల్లు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల క్రితం పొయ్యిలో కట్టెల కోసం ఇబ్బంది పడ్డారు. కంపచెట్లు, జిల్లెడు చెట్ల వేర్లు సైతం తొలగించి వంట చెరుకుగా ఉపయోగించుకున్నారు. గ్రామాల చుట్టూ వేలాది ఎకరాలు బోడి గుట్టలు దర్శనమించేవి. వర్షం కోసం జనం వేయి కళ్లతో వేచి చూసే పరిస్థితులు. వేసవిలో అధిక వేడి, పశువులకు మేత, నీరు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి దుర్భర స్థితి. ప్రజల్లో చైతన్యం ద్వారానే సామాజిక అడవుల సంరక్షించవచ్చనే నమ్మకంతో జనజాగృతి సంస్థ అడవుల సంరక్షణ శ్రీకారం చుట్టింది. మండలంలోని ముండ్లవారిపల్లి, దండువారిపల్లి, మొగిలిచెట్లతండా, రామ్లానాయక్‌తండా, పెద్దపల్లి, వడ్డుమరవపల్లి, మార్పురివాండ్లపల్లి తదితర గ్రామాల వద్ద వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న రెవెన్యూ గుట్టల్లో అడవుల పెంపకం చేపట్టడానికి గ్రామస్థులతో చర్చించింది. గ్రామంలోని మహిళలు, రైతులు, కూలీలను సంఘాలుగా ఏర్పాటు చేసింది. వివిధ కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసింది. ప్రజలే తమ గ్రామాల వద్ద ఉన్న అడవులను కాపాడుకునేలా చైతన్యం కల్పించింది. ప్రతి గ్రామం వద్ద ఒక వాచర్‌ను నియమించి సంస్థ వారికి జీతం ఇచ్చింది. యేడాదిపాటు సంరక్షణ చేపట్టడంతో గుట్టల్లో అప్పటికే ఉన్న మొక్కలు చిగురించడంతో గ్రామస్థుల్లో అడవుల పెంపకంపై నమ్మకం పెరిగింది. రాత్రి సమయంలో అగ్గి పెడితే గ్రామస్తులే ఆర్పుకునేలా చైతన్యం నింపింది. దీంతో ప్రతియేటా పచ్చదనం అభివృద్ధి చెందుతూ వచ్చింది. జనజాగృతి కొన్నేళ్లపాటు పనిచేసి, ఆ గ్రామాల నుంచి విరమించింది. అయినా గ్రామస్థులు అడవుల పెంపకాన్ని వదులుకోలేదు. 30 ఏళ్లుగాఅటవీ సంరక్షణ చేపడుతున్నారు. దీంతో ఆ గ్రామాల వద్ద ఉన్న అడవుల్లో పచ్చదనం పరుచుకుంది. నేడు ఈ అడవుల నుంచి వ్యవసాయ పనిముట్లు, పశుగ్రాసం, సీతాఫలాలు, విస్తరాకులు, ఆయుర్వేద మూలికలు, వేర్లు తదితర వాటిని తెచ్చుకుంటున్నారు. అడవి విస్తరించడంతో ఎండా కాలం కూడా గ్రామాల్లో చల్లదనం ఉంటుందని గ్రామస్థులు అంటున్నారు. గ్రామాల వద్ద ఎటుచూసినా జింకలు, నెమళ్లు, కుందేళ్లు, పక్షులు కనిపిస్తున్నట్లు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


మొగిలిచెట్ల తండా ప్రజలు స్వచ్ఛందగా కాపాడుకుంటున్న అటవీ ప్రాంతం

ఎన్నో ఇబ్బందులు పడ్డాం



మా గ్రామం వద్ద 1995లో జనజాగృతి సంస్థ అడవుల సంరక్షణకు శ్రీకారం చుట్టింది. పొయ్యిలోకి కట్టెలుకూడా దొరకని పరిస్థితి. రాత్రి సమయంలో అగ్గిపడినా 90 మంది మహిళలు గ్రూపుగా ఏర్పడి ఆర్పిన సంఘటనలు ఉన్నాయి. ఇతర గ్రామాల వారి మేకలు మేపడానికి వస్తేవెంటబడి తరుముకున్న రోజులు ఉన్నాయి. నేడు మా గ్రామం వద్ద పెరిగిన అడవులను 26 దేశాలకు చెందిన ప్రతినిధులు సందర్శించారు. ఎంతోమంది ఉన్నతాధికారులు, అప్పటి కలెక్టర్ అనూరాధ సందర్శించి అభినందించారు.

- తులసమ్మ, మొగిలిచెట్లతండా

ప్రభుత్వమే లీజుకు ఇచ్చింది



రామ్లానాయక్‌తండా, మొగిలిచెట్లతండా గ్రామాల్లో ఉన్న 90 మంది మహిళలు సంఘంగా ఏర్పడి, తండాల వద్ద ఉన్న 210 ఎకరాల రెవెన్యూ గుట్టలను కాపాడుకున్నాం. అప్పటి జిల్లా కలెక్టర్ కృపాదాస్ ఆదేశాలతో మహిళలకు 99 సంవత్సరాలకు అడవిని ప్రభుత్వం లీజుకిచ్చింది. అటవీ సంరక్షణకోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నేడు జింకలు, నెమళ్లు, ఎక్కువ కావడంతో అటవికి దగ్గరలో ఉన్న భూముల్లో పంటలను సాగుచేసే పరిస్థితి లేదు. వన్యప్రాణులను కాపాడుకుంటున్నాం.

-లక్ష్మమ్మ, మొగిలిచెట్లతండా

ఆదాయం ఇచ్చే చెట్లు ఉంటే బాగుండేది



మా గ్రామాల వద్ద 30 యేళ్లుగా అడవులను కాపాడుకుంటున్నాం. అడవుల్లో వివిధ రకాల చెట్లు, మూలికలు ఉన్నాయి. వీటితోపాటు కుంకుడు, వెదురు, సీతాఫలం, కానుగ రేగు, రేల, రోజ్‌వుడ్, ఉసిరిలాంటి ఆదాయం వచ్చే చెట్లును పెంచుకుని ఉంటే అడవుల ద్వారా మరింత లాభం వచ్చి ఉండేది. ఆ వైపుగా ప్రయత్నాలు చేస్తున్నాం.

-రామమూర్తినాయక్, ముండ్లవారిపల్లి

ఆదాయం వచ్చేలా ప్రయత్నిస్తున్నాం



30 సంవత్సరాలుగా ప్రజలు స్వచ్ఛందంగా అడవులను కాపాడుకుంటున్నారు. పచ్చదనం పెరిగింది. అటవీ జంతులు, వివిధ రకాల పక్షులు అభివృద్ధి చెందాయి. నేడు రెవెన్యూ అడవుల ద్వారా గ్రామస్థులకు ఆదాయం వచ్చేలా వివిధ రకాల మొక్కలను నాటడానికి మా వంతు ప్రయత్నాలు చేస్తున్నాం.

-బలరాం, అధ్యక్షుడు, జనజాగృతి

న్యూస్ బాక్స్

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌కు ఘనసన్మానం



రాకేష్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్య నాయకులు

పెనుకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బీసీసంక్షేమ శాఖ మంత్రి సవిత జన్మదిన వేడుకలకు హాజరైన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాజేష్‌కు స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కమ్యూనిటీ ఇంటర్నేషనల్ ప్రతినిధి కెఎస్ ఆర్ మూర్తి, కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశప్ప, గురుస్వామి, ఎల్ఐసి మోహన్, శబరీష్ శిరీష్ పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడికి ఘన స్వాగతం



లక్ష్మణ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న బీజేపీ నేతలు

గోరంట్ల, జనవరి15(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు బీజేపీ నాయకులు బుధవారం గోరంట్లలో ఘనంగా స్వాగతం పలికారు. కదిరిలో జరుగుతున్న అటల్‌బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మండలం బూదిలి క్రాస్ వద్ద బీజేపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికి శాలువతో సన్మానించి, జ్ఞాపికను అందచేశారు. ఆయనతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర దళిత మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో పోలీసుల నిఘా

చిలమత్తూరు, జనవరి15(ఆంధ్రజ్యోతి):అటవీ ప్రాంతాల్లో, పొలాల్లో, చెట్లపొదల చాటున అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు నిఘా పెంచారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా జూదాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి కార్యకలాపాలకు చెక్ పెట్టడానికి సిఐ జనార్ధన్, ఎస్ఐ మునీర్ అహమ్మద్‌లు తమ సిబ్బందితో కలిసి చిలమత్తూరు, సోమఘట్ట, చాగలేరు, పలగలపల్లి గ్రామాల శివార్లలో డ్రోన్ కెమెరాలతో మంగళవారం జల్లెడపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రోన్ కెమెరాల ద్వారా అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉంటుందన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

అమరాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరాపురం గ్రామంలో బుధవారం వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను వడ్డెర సంఘం యువకులు, మరియు గ్రామస్తులు ఘనంగా జరుపుకొన్నారు. శ్రీరామ వడ్డే ఓబన్న యువక సంఘం యువకులు ఓబన్న ప్రతిమను ట్రాక్టర్‌లో ఉంచుకొని పురవీధుల మీదుగా మేళ తాళాల మధ్య ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వడ్డెర యువకులు మాట్లాడుతూ వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వడ్డెర్లకు కుల వృత్తుల నుండి జీవనం సాగించడమే చాలా కష్టంగా ఉందని, రాతి పని చేసుకొని జీవించే వడ్డెర్లు ప్రస్తుతానికి ఏపని చేయలేక ఉన్నట్లు శ్రీరామ కమిటీ సభ్యులు తెలిపారు. జయంతి ఉత్సవాల సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

వైసీపీ సమన్వయకర్తతో జిల్లా ఉపాధ్యక్షుడు

గుడిబండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్పను వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్ బుధవారం కలిశారు. మండలంలోని ఫళారం గ్రామంలోని ఈరలక్కప్ప స్వగ్రామానికి చేరుకొని ఆయనకు శాలువాకప్పి పూలహారం వేసి ఘనంగా సన్మానించారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడంతో తనకు ఎంతో బాధ్యత పెరిగిందని పార్టీ అభివృద్ధికి రాబోయే రోజుల్లో ఎన్నికల్లో వైసీపీ పార్టీ విజయానికి కష్టపడి పనిచేస్తానని ఆయన తెలిపారు.

అవోపా సంక్రాంతి సంబరాలు



విజేతకు బహుమతి అందజేస్తున్న అవోపా నాయకులు

గోరంట్ల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంస్థ అవోపా ఆధ్వర్యంలో గోరంట్లలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పట్టణంలో రంగోళి కార్యక్రమాన్ని చేపడుతూ, ఆర్యవైశ్యులు తమ ఇళ్ల ముందు సంప్రదాయ రీతిలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. ఆవోపా కమిటీ ముగ్గులను పరిశీలించి, గెలుపొందినవారికి ఇళ్లవద్దకే వెళ్లి బహుమతులు అందజేసింది. ప్రథమ బహుమతిగా కౌలిని పూజాకు రైస్‌కుక్కర్, రెండో బహుమతిగా సరితసింధూకు స్టీల్ హాట్ బాక్స్, మూడో బహుమతిగా పల్లవికి ఐరన్ బాక్స్, కన్సోలేషన్ బహుమతిగా చైతన్య, మమత, అపర్ణా, అనన్యకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందించారు. కార్యక్రమంలో ఆవోపా నాయకులు షబరీష్, సుకుమార్ గుప్తా, రాజేష్, రవితేజ, రమేష్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీచేస్తున్న నేతలు

పేదలకు దుప్పట్ల పంపిణీ

గోరంట్ల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం క్రాస్ వడిగేపల్లి ఎస్సీకాలనీలోని పేదలకు టీడీపీ నాయకులు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. జాతీయ రహదారి కూడలిలో మంత్రి సవిత జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. వడిగేపల్లి, పాలసముద్రం పంచాయతీ నాయకులు జయచంద్ర, మనోహర్, మూర్తి, హరీష్, నరసింహమూర్తి, చంద్రనాయక్, తదితరులు వేడుకలనంతరం ఆయా గ్రామల్లో దుప్పట్లు పంపిణీ చేశారు. పాలసముద్రంలో అన్నదానం చేశారు.

పల్లెలపై పట్టుకోల్పోతున్న ఖాకీ

- మూడు, నాలుగు గ్రామాలకు ఒకే కానిస్టేబుల్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట ఎలా?
- క్షేత్రస్థాయిలో కొరవడిన నిఘా



హిందూపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ పోలీస్ అధికారులందరూ పోలీసులు ప్రజలకు చేరువకావాలని చెబుతుంటారు. అప్పుడే నేరాల నియంత్రణ జరుగుతుందని చెబుతుంటారు. కాని గ్రామ పోలీస్ వ్యవస్థ ఎప్పుడో గాడితప్పింది. పోలీసులకు పెరిగిన బాధ్యతలు కావచ్చు, లేదా పట్టణాల్లో మండల కేంద్రాల్లో రాస్తారోకోలు, ధర్నాలు కోర్టుకేసులు కావచ్చు. వీఐపీ ప్రోటోకాల్ వల్ల బిజీ కావడంతో పల్లెలవైపు అప్పుడప్పుడు వెళ్లివస్తున్నారేతప్ప క్షేత్రస్థాయిలో పట్టుబిగించేలా ఎవరూ పనిచేయడంలేదన్నది నగ్నసత్యం. ఎందుకంటే పోలీసులు పల్లెల్లో క్షేత్రస్థాయికి వెళ్లి జనాన్ని కలిసి ఆరాతీస్తే కొంతవరకు ఫలితాలు వస్తాయి. కానీ పోలీసులు పల్లెలపై పట్టుకోల్పోతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. దీనివల్ల పల్లెల్లో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి.

పోలీసులు ఒకప్పుడు పల్లెబాటపట్టేవారు. రాత్రిపూట అక్కడే నిద్రించేవారు. దీనివల్ల పల్లెల్లో ఏం జరుగుతుందో తెలిసేది. కానీ ప్రస్తుతం వైసీపీ అధికారంలోకి వచ్చాక పోలీస్ వ్యవస్థ వైసీపీ నాయకుల ప్రొటోకాల్‌కే పరిమితమయ్యారు. మరికొంతమంది వీరవిధేయులుగా ఉంటూ శాంతిభద్రతలను గాలికి వదిలేశారు. దీనివల్ల కూటమి ప్రభుత్వం వచ్చి ఆరునెలలు దాటినా ఇప్పటికీ పలుచోట్ల లాఅండ్ ఆర్డర్ అదుపులోకి రాలేదు. దీనినిబట్టి పల్లెల్లో పోలీసులకు ఎంత పట్టుఉందో అర్థం అవుతుంది. పట్టణాల్లో అయితే జనం ఎక్కువగా ఉంటారు, అక్కడ జరిగే కార్యక్రమాలు బయటకు పొక్కవు. పల్లెల్లో అలాకాదు ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు ప్రారంభమయ్యాయంటే వెంటనే పక్కింటివారికి, తెలుస్తుంది. దీంతో పోలీసులు ప్రజలకు చేరువలో ఉంటే నేరాలను ముందుగానే పసిగట్టి అదుపు చేయడానికి ఆస్కారం ఉంటుంది.

సిబ్బంది కొరతే కారణం

ప్రస్తుతం పెరిగిన నేరాలు జనసాంద్రతనుబట్టి ఒక్క పోలీస్ స్టేషన్‌కు 50మంది పోలీసులు ఉన్నా తక్కువేనని చెప్పవచ్చు. అయితే ఏ పోలీస్ స్టేషన్‌లో కూడా 20మందికి మించి సిబ్బంది ఉన్నట్లు కనిపించడంలేదు. కొన్ని స్టేషన్‌లలో 10మంది కూడా లేరు. దీంతో ఉన్నవారిలో కూడా కోర్టు డ్యూటీకి ఇద్దరు, రిసప్షన్‌లో ఒకరు, ఆసుపత్రి డ్యూటీలో ఒకరు, ఇక వీఐపీ బందోబస్తు, విజయవాడ బందోబస్తుకు ఇద్దరు పోను మరికొంతమంది ప్రజా ప్రతినిధులు జిల్లాలో పర్యటిస్తే వారికోసం బందోబస్తుకు వెళ్లాల్సి ఉంటుంది. ఇక గ్రామాల్లో పర్యటించడానికి సమయం ఎక్కడుంది. పల్లెలో శాంతి భద్రతలను అదుపుచేయడానికి సిబ్బంది ఎక్కడుంటారు. దీనివల్ల గ్రామ పోలీస్‌వ్యవస్థ అటకెక్కిందని చెప్పవచ్చు. గ్రామ సచివాలయంలో మహిళా పోలీసు ఉన్నా వారికి శాంతి భద్రతలు, అసాంఘిక కార్యకలాపాలు పసిగట్టడంలో అంతఅవగాహనలేదు. ఒకప్పుడు పోలీసులు పల్లెలకు వెళ్లి సమాచారాన్ని సమగ్రంగా సేకరించేవారు. ఆ సేకరించిన సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచేవారు. అయితే ప్రస్తుతం గ్రామ పోలీసులను గ్రామ సమాచారం అడిగితే నోరుమెదపడంలేదు. అంతేకాక ప్రతిసారి గొడవకు కారణమైన వారిని గుర్తించి వారి సమాచారాన్ని సమగ్రంగా రికార్డ్ చేసేవారు. అంతేకాక పల్లెల్లో జనాభా, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర రంగాల నిపుణులు, రేషన్ డీలర్లు, సేవచేసేవారు, గ్రామంలో తలార్లు, గ్రామపెద్దలు, పాతనేరస్తులు, ప్రస్తుతం వారు ఏం చేస్తున్నారు? ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఏటీఎంలు, ఆలయాలు, తదితర సమాచారం తీసుకునేవారు. కల్లు దుకాణాలు ఎన్నిఉన్నాయి? ఎవరైనా కొత్తగా పల్లెలోకి వచ్చి స్థిరపడితే వారి వివరాలు అన్నీ సేకరించి డైరీలో నమోదుచేసి కొంతమంది పల్లెల్లో పెద్ద మనుషులవద్ద సంతకాలు తీసుకుని స్టేషన్‌లో భద్రపరిచేవారు. దీంతో ఏదైనా కావాలంటే టక్కున సమాధానం వచ్చేది.

మూడు, నాలుగు గ్రామాలకు ఒకే కానిస్టేబుల్

మండలంలో కనీసం 30నుంచి 50గ్రామాలుంటాయి. పోలీస్ సిబ్బంది మాత్రం పది నుంచి 15 మంది ఉన్నారు. ఒక కానిస్టేబుల్ మూడు నాలుగు గ్రామాలు చూసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక పంచాయతీకి ఓ కానిస్టేబుల్ ఉంటాడు. ఆ పంచాయతీలో రెండు నుంచి ఐదు గ్రామాలుంటాయి. ఆ గ్రామాలన్నీ సదరు కానిస్టేబుల్ చూసుకోవాల్సిన పరిస్థితి. దీంతో పర్యవేక్షణ కరవై పేకాట, మట్కా, గంజాయి, దొంగతనాలు జరిగే ఆస్కారం పెరుగుతోంది.

ఊపిరి ఉన్నంతవరకు అండగా ఉంటా

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

● ఘనంగా జన్మదిన వేడుకలు ● అడుగడుగునా పూలవర్షం





గజమాలతో సత్కరిస్తున్న వడ్డెర సంఘం నాయకులు వెంకట్, మహేంద్ర

పెనుకొండ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తన ఊపిరి ఉన్నంతవరకు అన్నివిధాలుగా నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం మంత్రి సవిత జన్మ దినాన్ని ఘనంగా జరిపారు. మంత్రి పుట్టిన రోజు సందర్భంగా అవిముక్తేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున హిందూపురం నుంచి పెనుకొండకు వస్తున్న మంత్రి సవితపై అడుగడుగునా పూలవర్షం కురిపించారు. అలాగే ప్రధానసర్కిల్‌లో గజ మాలతో స్వాగతం పలికారు. పెనుకొండలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యకర్తల, నాయకుల మధ్య కేక్‌లు కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర, జిల్లా నలుమూలల నుంచి మంత్రి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వారి అభిమానం మరువలేనిదని తన ఊపిరి ఉన్నంతవరకు అన్నివిధాలా వారిని ఆదుకుంటామని, పెనుకొండ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. గతంలో వైసీపీ పాలనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని అప్పటి నుంచి తనకు అండగా నిలబడిన నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. రానున్న రోజుల్లో జరిగే నగర, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో అందరికీ న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న వెంకటరాముడు, మాధవనాయుడు, సిద్దయ్య పోలిరెడ్డి, సూరి, దాదు, త్రివేంద్ర, క్రిష్ణమూర్తి, షౌకత్, ప్రసాద్, యు.నరసింహులు, నాగరాజు, శ్రీనాథ్‌చౌదరి, పవన్‌కుమార్, అరుణ్‌కుమార్, హరీష్, రెడ్డి వారి మంజునాథ్ పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలంలోని కేతగానిచెరువు, చాల కూరు, బ్రాహ్మణపల్లి, పందిపర్తి, చాకర్లపల్లి, గ్రామాల్లో మంత్రి సవిత జన్మదిన వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. పలు చోట్ల కేక్ కట్ చేశారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి సవిత



పుట్టినరోజు వేడుకలకు హాజరైన నాయకులు, కార్యకర్తలు



ప్రేమసాయిసదన్‌లో చిన్నారుల మధ్య కేక్ కట్‌చేస్తున్న మంత్రి సవిత

వడ్డెర సంఘం నాయకుల సత్కారం



మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

పెనుకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం వడ్డెర సాధికార సమిత రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్, మీడియా కోఆర్డినేటర్ పల్లపు మహేంద్ర ఆధ్వర్యంలో వడ్డెర్లు మంత్రి సవితను స్థానిక వైజంక్షన్‌లో వడ్డెర్లు కలిసి గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మహేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీజే సౌండ్ సిస్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సాయి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి

హిందూపురం: బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత జన్మదిన వేడుకలను హిందూపురంలోని ప్రేమసాయిసదన్‌లో ఘనంగా జరుపుకున్నారు. బుధవారం మంత్రి జన్మదిన సందర్భంగా ప్రతియేడాది హిందూపురంలో ప్రేమసాయిసదన్‌లో విద్యార్థుల మధ్య జరుపుకుంటోంది. ఈ యేడాదికూడా చిన్నారుల మధ్య కేక్‌కట్‌చేసి వారికి దుస్తులు పంపిణీ చేశారు. వారి మధ్యే కూర్చుని అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 12ఏళ్లుగా హిందూపురంలోని ప్రేమసాయిసదన్‌లో చిన్నారుల మధ్యే జన్మదిన వేడుకలు జరుపుకుంటున్నారన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

పెనుకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగలను ప్రజల ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నపిల్లలు నూతన వస్త్రాలు ధరించి ఇంటింటికి వెళ్లి పండగ ప్రత్యేకమైన నువ్వులు, బెల్లం, కొబ్బరి, కలిపిన మిశ్రమంతోపాటు చెరుకుముక్కలు, అరటి పండ్లు, రేగుపండ్లు, అనపకాయలను, పంచిపెట్టారు. అనంతరం చిన్న పిల్లలను కూర్చోబెట్టి చెరుకుముక్కలు, చిల్లర నాణాలువేసి పిల్లల తలలపై వేశారు.

మడకశిరటౌన్: సంక్రాంతి పండుగలో భాగంగా మొదటి రోజు బోగి, రెండవ రోజు సంక్రాంతి, మూడోరోజు బుధవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి, షిర్డిసాయినాథుని ఆలయాల్లో గోమాతకు పూజ నిర్వహించారు.

గుడిబండ: మండలంలో మహిళలు సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి ముందు ప్రత్యేకంగా ముగ్గులు వేసి సంక్రాంతి పండుగను జరుపుకొన్నారు.



పిల్లలకు భోగిపళ్లు పోస్తున్న తల్లులు

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పరిగి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జయమంగళి నదిలో బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు సీజ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనుమతులకు సంబంధం లేకుండా అనధికారికంగా శాసనకోట గ్రామ సమీపంలో జయమంగళి నది నుంచి అక్ర మంగా ఇసుక తరలిస్తున్నట్లు స్థానికుల సమాచారం. ఈ మేరకు తనిఖీలు చేపట్టి హిందూపురం, పరిగి, కొడిగెనహళ్లి గ్రామాలకు చెందిన ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.



సీజ్ చేసిన ట్రాక్టర్లు

సొంతూరిలో సంబరాలు

శింగనమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తన స్వగ్రామం, శింగనమల మండలం ఆలంకరాయునిపేటలో కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. హోదాను పక్కనపెట్టి గ్రామస్థులతో కలిసిపోయారు. స్కూటర్ ఎక్కి ఊరంతా తిరిగారు. గ్రామస్థుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. యువకులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. గోలీలు, వాలీబాల్ ఆడుతూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎంఎస్ రాజు

కల్లుగీత కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తా

● గౌడసంఘం అధ్యక్షుడు గురుమూర్తి



మాట్లాడుతున్న ఈడిగ కార్పొరేషన్ చైర్మన్

పెనుకొండ టౌన్, జనవరి15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో జిల్లా టీడీపీ కులస్థులతో సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇటీవల ఎక్సైజ్ పోలీసులు కల్లు దుకాణదారులపై దాడులు జరుపుతూ నానా ఇబ్బందులకు గురిచేయడం జరుగుతోందని, వాటన్నింటని మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా నన్నారు. అలాగే నియోజకవర్గాల వారిగా ఉన్న ఈడిగ కులస్థులతో కలిసి జిల్లా కేంద్రాల్లో భారీ సమావేశం నిర్వహి స్తామన్నారు. కార్పొరేషన్ల ద్వారా అర్హులం దరికీ రుణాలందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గిరిధర్ గౌడ్, చిన్నప్పయ్య, సోమశేఖర్, దేవేంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుడికట్ల పూజార్లకు గౌరవ వేతనం



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పూజారులు

పెనుకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత జన్మదినాన్ని పురస్కరించుకుని కురుబల కులదైవాల పూజార్లు ఆమెను కలిసి ఆశీర్వదించారు. అనంతరం కురుబ కులస్థుల పూజారులకు గౌరవవేతనం ఇవ్వాలని మంత్రిని కోరారు. మౌజాన్లకు, చర్చిలో పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవవేతనం ఇస్తున్నారని ఆలయాల్లో పూజారులకు సైతం గౌరవవేతనం ఇస్తున్నారని అలాగే గుడికట్ల పూజారులకు కూడా గౌరవవేతనం ఇచ్చేవిధంగా ముఖ్యమంత్రితో చర్చించాలని కోరారు. రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాధకృష్ణ, వేణుగోపాలాచార్యులు, రమేష్, బాబు, గుడికట్ల పూజార్లు పాల్గొన్నారు.

జగన్ ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

సోమందేపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో వైసీపీ నాయకులు ఏర్పాటుచేసిన 20అడుగుల జగన్ ఫ్లెక్సీని చించివేశారని బుధవారం ఆ పార్టీ జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకట్, స్థానిక నాయకులతో కలిసి సోమందేపల్లిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ కావాలనే దురుద్దేశ్యంగా ఫ్లెక్సీని చించారంటూ పోలీసులు విచారించి కఠినంగా శిక్షించాలని కోరారు.

రక్తదాన శిబిరం

పెనుకొండ టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మంత్రి సవిత జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు మోహన్ బాబు, షఫీ, ఎంఎన్‌ఓ డా.రాజ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సోమందేపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాలయం, అయ్యప్ప ఆలయం, హరిహరపుత్ర ఆలయాల్లో మంగళవారం మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివానగర్‌లో గురుస్వామి కుళ్లాయప్ప ఆధ్వర్యంలో కర్పూర జ్యోతి వెలిగించి పూజ నిర్వహించగా హరిహరపుత్ర ఆలయంలో మకర జ్యోతి దర్శనం సందర్భంగా భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పలు పాల్గొన్నారు.

ముస్లిం సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

అమరాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ముస్లిం సంక్షేమ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్ బాషా, ఉపాధ్యక్షుడు హసన్ బాషా, కార్యదర్శి షబ్బీర్ హాజరయ్యారు. ముస్లిం యువత అన్ని రంగాల్లో ముందు ఉండాలని రాష్ట్ర అధ్యక్షులు ఖలందర్ బాసా పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆయన మాట్లాడారు. ముస్లిం యువత చేతి వృత్తులకే పరిమితం కాకుండా మంచి విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన కోరారు. ముస్లిం పిల్లలకు విద్య గొప్పతనాన్ని తెలియజేసి చదువుకొనేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎంహిదాయత్, మండల ఉపాధ్యక్షులు అన్వర్‌బాష, ప్రధాన కార్యదర్శి మహబూబ్, గౌరవ అధ్యక్షులు నిజాముద్దీన్, కోశాధికారిగా వాజిద్, జాయింట్ సెక్రెటరీగా డాక్టర్ హిబ్బు, ముస్లిం మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు.